# పడిలేచిన కెరటం

## - గంటి భానుమతి



*(గత సంచిక తరువాయి)*

**అసలు వీళ్ళెవరు** నన్ను పట్టుకోడానికి ? నేను నా ఇష్టం వచ్చినట్లు నేనుండచ్చు.ఆ స్వతంత్రం నాకుంది. అది నాహక్కు. దాన్ని నేను వాడుకుంటాను. కాని,అప్పటికే సిస్టర్ ఇంజెక్షన్ ఇచ్చేసింది. నా మాట వినలేదు. ఓడిపోయాను. వాళ్ళే గెలిచారు. నాకు పెద్ద అవమానం జరిగిపోయింది. నిస్సహాయంగా చూస్తూండిపోయాను. కళ్ళు మూసుకు పోతున్నాయి. ఎంత సేపు అలా ఉన్నానో తెలీదు. అంటే నిద్ర పోయాననిపించింది.

తెలివి వచ్చాక అంతా ప్రశాంతంగా ఉంది. కాని తలనొప్పి,నోరు కూడా ఎండి పోతున్నట్లుగా ఉంది. అంతకు ముందున్న భయం ఇప్పుడు లేదు . కోపం లేదు.

కాని కళ్ళు తెరవడానికి రాలేదు, ఎంతో ప్రయత్నం మీద కళ్ళు తెరిచాను. కలలా ఉంది . టెర్రేస్ పైనుంచి పడాలనుకున్నాను. పడ్డానా,కిందమెత్తగా ఉంది. పరుపులాగా ఉంది. నేల లాగా లేదు. అంటే నేను కింద పడలేదా! పడలేదు. వీపుకి గట్టి నేల తగలడం లేదు. మెత్తటి పరుపుంది. మరైతే ఎక్కడున్నాను? మాఇంట్లోనా? మా ఇంట్లో గోడలు ఈ రంగులో లేవు. ఒక వేళ ఉన్నా ఏ గదిలో? గుర్తుకు రావడం లేదు. అలా ఆలోచిస్తూండగానే సిస్టర్ వచ్చింది. ఆమె బట్టలని బట్టి అనుకున్నాను.

" శృతీ ఎలా ఉంది ? తల దిమ్ముగా ఉందా? కడుపులో ఏమైనా తిప్పుతోందా. వాంతి వచ్చేట్లుగా ఉందా ? "

"ఇది హాస్పటలా ! నేను ఓ పేషెంటునా ! " ఆమె డ్రెస్ ని బట్టి ఆమె ఓ నర్స్ లాగా అనిపించింది.

" అవును . మానసిక రోగుల చికిత్స కేంద్రం లో ఉన్నావు. ఈ రోజు పొద్దున్న జాయిన్ అయ్యావు. ఇప్పుడు సాయంత్రం అయింది "

నాకు నోట మాట రాలేదు. మానసిక చికిత్స అంటే నేను మెంటల్ ఆసుపత్రిలో ఉన్నానా! పదో క్లాసులో స్కూలు ఫస్ట్, క్లాస్ లీడర్, స్కూల్ కాప్టెన్, అన్నింట్లో ఫస్ట్ ఇంటర్ లోకూడా అంతే. కాలేజి బ్యూటి,మొగ పిల్లలు ఉత్తరాలు రాసేవారు. అందరూ ఆరాధించే విధంగా ,ఎంతో స్మార్ట్ గా తెలివైన అమ్మాయి అయిన నేను ఈ మెంటల్ ఆసుపత్రిలో ఉండడం ఏంటీ? అపనమ్మకంగా ఆమెని చూసాను.

"నేను సిస్టర్ మమతని. ఎలా ఉన్నావ్? పొద్దున్న నీకు కొంచెం బాగాలేదు. మంచినీళ్ళు కావాలా?" అంటూ నా మణికట్టు పట్టుకుంది.

అప్పుడు గుర్తొచ్చింది,ఉదయం ఆమెని గట్టిగా కొట్టాను. అరిచాను. కొంచెం సిగ్గు పడ్డాను.

" ఇప్పుడు నాకు బాగానే ఉంది. పొద్దున్న నేను టూమచ్ గా బిహేవ్ చేసాను కాని ఇప్పుడు బాగానే ఉంది సారీ " అన్నాను.

" అవును బాగానే ఉంటుంది. ఎందుకంటే ఈసీటి కదా "

" ఈసీటీ అంటే ? "

" ఎలక్ట్రిక్ షాక్ తెరపీ, మీకింకా దీనిని గురించిన వివరాలు కావాలంటే, డాక్టర్ గారిని అడగండి. ఆయన మీకు చెప్తారు "

షాక్ తిన్నట్లు చూసాను. మాట పడిపోయింది. నాకు ఎలక్ట్రిక్ షాక్ ఇచ్చారా? అంటే సినిమాల్లో ల్లాగా అన్నీ వైర్లు పెట్టి కరెంటు పాస్ చేస్తూంటే ఆ పేషెంట్ ఎగిరి ఎగిరి పడడం, ఆ తరవాత ఏం జరుగుతుందో సినిమాల్లో చూపించ లేదు. నాకు అంతవరకే తెలుసు. ఇప్పుడు నాకు అలా చేయించారా? నాలో అసలు ఏం జరుగుతోంది? ఇప్పుడు నిజంగా నాకు పిచ్చి పట్టేలా ఉంది. ఆ ఆలోచన రాగానే ఏడుపొచ్చింది. అంతే. నిశ్శబ్ధంగా ఉన్నాను. ఆమె నా వైపు చూసింది.

" కొంచెం సేపట్లో డాక్టరు గారు వస్తారు. అతను మీతో మాట్లాడుతారు"

ఆమె అన్నట్లు గానే అంతలో డాక్టరుగారు వచ్చారు. మరో ఇద్దరు కూడా అతని వెనకాల ఉన్నారు.

" నేను ఈ వింగ్ కి డాక్టర్ ని. నాపేరు పాల్ "

ఎందుకో వెంటనే డాక్టరు గారి మాటలు వినగానే వంశీ గుర్తొచ్చాడు. వంశీ కూడా అంతే. ప్రతీసారి నేను వంశీ కృష్ణ ని, ఈ క్లాసులో చదువుతున్నాను. అంటూ తనని తాను పరిచయం చేసుకుంటాడు. నేను నవ్వేసే దాన్ని. ప్రతీ సారి నిన్ను నువ్వు ఎందుకు పరిచయం చేసుకుంటావు. మూడేళ్ళ నుంచి మనిద్దరం ఒకే క్లాసులో ఉంటున్నాం కదా. నువ్వు ఎవరో మాకు తెలుసు. అనేవాళ్ళం.

"ఏదో ఓ మానరిజం ఉంటేనే కదా మనం గుర్తుంటాం" అని వంశీ నవ్వేవాడు.

ఆ మాట నిజం అందుకే కదా ,ఆ మానరిజంతోనే కదా, ఈ రోజు వంశీ గుర్తొచ్చాడు. చాలా రోజులయింది, వంశీ నుంచి ఉత్తరం అందుకని. ఎందుకో ఉత్తరం రాయలేదు. ఉత్తరం రాసినా అమ్మా వాళ్ళు కాల్చేసి ఉండచ్చు. ఉత్తరం కాల్చేస్తున్నట్లు,ఎన్నో,ఇంకాఎన్నో భయంకరమైన కళ్ళముందు ఉత్తరాలని కాల్చేస్తున్నదృశ్యం. కోపం వచ్చేస్తోంది. నా ఎదురుగా డాక్టరున్నారో,మరెవరున్నారో కూడా చూడలేదు. కోపాన్ని కంట్రోల్ చేసుకోలేను. ఎందుకు చేసుకోవాలి ?

" నాకు ఈసీటి ఇచ్చారా? నాకు తెలీకుండా ఇస్తారా? నాకు చెప్పక్కర్లేదా! నాకు తెలీకుండా, నన్నడగకుండా అలా ఎలా ఇస్తారు? " అని గట్టిగా అరిచాను.

డాక్టరు ఓ సెకెండు నావైపు చూసి, అక్కడ ఉన్న సిస్టర్స్ని బయటికి వెళ్ళమన్నట్లు తల ఊపాడు. గదిలో నేను డాక్టరు గారు ఇద్దరమే ఉన్నాం.

"శృతీ నీకు ఏం ఉందో మేము చెప్పాలి. ఇది మానిక్ డిప్రెషన్. సివియర్ డిప్రెషన్ అని అంటారు " అంతే నేను కళ్ళప్పగించి , నోరు తెరిచి,ఆతని మొహం చూస్తూండి పోయాను. అతని మాటలు నాకు ఏం అర్థం కాలేదు, ఒక్కటి మాత్రం నిజం. నేను మామూలుగా ప్రవర్తించడం లేదు. దానికి ఓ కారణం ఉంది. దానిపేరు మానిక్ డిప్రెషన్.

జీవితంలో మొదటిసారి ఆ మాటని వింటున్నాను. మొదటి సారి నాకు ఏ రోగం ఉందో డాక్టరు అంటూంటే వింటున్నాను.

"ఇది ఓ డిసీస్. మిగిలిన రోగాల్లాంటివే ఇది కూడా. నీ మెదడులో జరిగే రసాయనక చర్యల్లో బాలెన్స్ లేకపోతే, నీ మూడ్ మీద ప్రభావం చూపిస్తుంది. ఇది నీకు తెలీకుండా, నీ ప్రమేయం లేకుండా జరిగి పోతున్నాయి. దీనికి నువ్వు సిగ్గు పడక్కర్లేదు. నువ్వు కావాలని చెయ్యడం లేదు. నిన్ను సరి అయిన వాళ్ళ దగ్గరికే మీ వాళ్ళు తీసుకొచ్చారు. మైండ్ కి ప్రాబ్లెమ్ వస్తే, మనిషి ప్రవర్తనలో మార్పులొస్తే మా సైకియాట్రిస్ట్ ల దగ్గరికి వెళ్తారు. ఈ డిప్రెషన్ లో మనిషి మూడ్ మారిపోతుంది. అది అలల్లాగా ఓ సారి ఎక్కువ అవుతుంది ,ఓ సారి తగ్గుతుంది. ఇది ఎక్కువవకుండా ముందరే డాక్టర్ల దగ్గరికి వస్తే ఈ డిసార్డర్ కొంచెం తగ్గడానికి అవకాశాలున్నాయి. కాని చాలా మంది మా దగ్గరికి రావడానికి ఇష్ట పడరు. సమాజానికి భయపడి సైకియాట్రిస్ట్ దగ్గరికి వెళ్ళరు. బయటి వాళ్ళకి తెలిస్తే పిచ్చి అనుకుంటారని భయం. అసలు అది ఓ రోగం అని కూడా అనుకోరు. కాని నిన్ను బాగా గమనిస్తూ, నీకు ట్రీట్ మెంటు అవసరం అని అనుకుని నిన్ను తీసుకొచ్చిన మీ వాళ్ళకి ధన్యవాదాలు" డాక్టరు నా కళ్ళల్లోకి చూస్తూ అన్నారు.

" శృతీ, ఈ ఈసీటీ నీకిచ్చాం. నీకు చెప్పలేదని నీకు కోపం వచ్చింది. దీని గురించి నీకు చెప్తాను. ఈ.సీ.టీ అంటే ఎలెక్ట్రో కన్వ ల్సివ్ థెరపీ, నీ రిపోర్టు లన్నీ చూసాకా, ఇదే మంచిదనిపించింది. సీవియర్ డిప్రెషన్ ఉన్నప్పుడు, యాంటీ డిప్రెసెంట్స్ పని చేయనప్పుడు సూసైడల్ థాట్స్ ఉన్నవాళ్ళకి ,ఈ షాక్ థెరపీ ఇస్తారు. కానీ దీని మూలంగా నీ మూడ్ మామూలుగా అవుతుంది. ఎందుకంటే నీ ట్రీట్ మెంట్ లో ఇది ఓ భాగం. నువ్వుఇక్కడికి రాగానే నీ ట్రీట్ మెంట్ మొదలు పెట్టేసాం. ఇది మనిషిని మామూలుగా చేస్తుంది. మంచి ఫలితాలని ఇస్తుంది .ఇప్పుడు నువ్వు ఈ రోగంలో అడుగున ఉన్నావు. నిన్ను నువ్వు ఏదైనా చేసుకుంటావు, మేము ఈ విధమైన ట్రీట్ మెంటు ఇవ్వకుండా, నీకు యాంటీ డిప్రెసెంట్స్ ఇవ్వచ్చు. కాని అవి వాడడం మొదలు పెట్టాకా వెంటనే ఏం తెలీదు. ఫలితాన్ని ఇవ్వడానికి అది ఓ మూడు వారాలు తీసుకుంటుంది . నీ గురించి మీ వాళ్ళు చెప్పాకా ఇది మంచిదనిపించింది. ఎందుకంటే, ఈసీటీ ఇచ్చాకా ఆత్మహత్యా ప్రయత్నాలు చాలా వరకూ తగ్గాయని లెక్కలు తేలాయి. ఇది వారానికి రెండు సార్లు ఇవ్వాలి. ఓ వారం తర్వాత ఫలితాలు అన్నీ చూసాక ఈ రకమైన ట్రీట్ మెంటు అవసరమా లేదా అని ఆలోచిస్తాం "

నాకేం చెప్పాలో తెలీలేదు. నాకేం గుర్తు లేదు. నేను ఆత్మహత్యా ప్రయత్నాలు చేసానా?! మణికట్టు దగ్గర కోసుకోవడం, టెర్రేస్ మీద అమ్మా,నాన్నగారు నన్ను చూడడం అన్నీ అలాంటి ప్రయత్నాలా! నాకు తెలీకుండా చేసేస్తున్నానా? చాలా సేపటికి నేను చేసిన ప్రయత్నాలు నాకు ఏదో లీలగా చూచాయగా ఒక్కొక్కటే గుర్తొస్తున్నాయి. ఆశ్చర్యంగా ఉంది, నాలో యింత తెగింపు ఉందా! ఆ తెగింపు, ఆ మొండితనం రావడానికి, ఉండడానికి కారణం, ఇవాళ డాక్టరు గారి మూలంగా తెలిసింది.

ఒక్కటి మాత్రం నిజం, ఈ డాక్టరు నా గురించి చెప్పారు. ఇన్ని నెలల్లో మొదటి సారి నాకేం అయిందో, నాలో ఏం జరుగుతోందో నాకు అర్థం అయ్యేలా చెప్పారు. అంతా సద్దుకుంటుందని అని కూడా అన్నారు. ఈ డాక్టర్ని నేను నమ్ముతాను. ఎందుకంటే ఆయన నన్నుఓ పేషెంటులా చూడడం లేదు. ఏదీ దాచలేదు. అన్నీ వివరంగా చెప్పారు. అది చాలు నమ్మడానికి.

ఇన్ని నెలల తరవాత నాతో ఓ వ్యక్తి ఇంత సేపు మాట్లాడారు. నన్ను ఓ మామూలు మనిషిగా గుర్తించారు. నా గురించి నేను సిగ్గు పడక్కర్లేదు. అని ధైర్యం చెప్పారు. సిస్టర్ ని పట్టుకుని గట్టిగా అరిచాను. అప్పుడు అలా అన్నందుకు ఇప్పుడు ఫీల్ అవుతున్నాను. అంటే నేను ఈ తేడాని కనిపెట్ట గలుగుతున్నాను. అంటే నేను కావాలనుకుంటే నా ఆలోచనలని మార్చుకుని మామూలుగా అవచ్చు.

నాలాంటి వాళ్ళు ఈ ప్రపంచంలో ఎంతో మంది ఉన్నారు.వాళ్ళు ట్రీట్ మెంటు చేయించుకుంటున్నారని అని డాక్టరు గారు అన్నారు. ఆయన మాటలని బట్టి , తెలుస్తోంది నేను సరి అయిన డాక్టర్ల దగ్గరికే వచ్చాను. ఈ మాట ఓ పెద్ద రిలీఫ్ గా అనిపించింది.

ఆ రోజు నాన్న గారు ఎంతో మందితో మాట్లాడుతూ కనిపించారు. ఎంతో మంది ఫోన్ నంబర్లు తీసుకున్నారు. ఎక్కడెక్కడికో ఫోన్ చేసారు.ఆఖరికి ఇక్కడికి తీసుకొచ్చారు.  సరి అయిన సమాచారం తీసుకున్నారు. సరి అయిన ఆసుపత్రి అని అంటున్నారు. నిజమే ఇది సరి అయిన ఆసుపత్రే.

"మేము నీతో ఉంటాము. నీకు తగ్గేలా చేస్తాము. అన్ని విధాలా నువ్వు మాకు సహకరించాలి. ఇక్కడ నీకు కొంచెం కష్టంగా ఉంటుంది. ఎందుకంటే ఇక్కడ కొన్ని టైమింగ్స్ అదీ ఫాలో చెయ్యాలి. అది నీకు ఇబ్బంది గా ఉండచ్చు. ఇన్ని రోజులూ నువ్వు, నీ ఇష్టం వచ్చినట్లుగా ఉన్నావు. కానీ ఇక్కడ నువ్వు మేము చెప్పినట్లుగా ఉండాలి. ముందు నీ మైండ్ సెట్ మారేలా చేస్తాం.

ఎందుకంటే నీకు ఏం రాదని,ఎందుకూ పనికి రావని,డిప్రెషన్ లోకి వెళ్ళిపోయావు. ఒక్కొక్కసారి, నువ్వేం చేస్తున్నావో,ఏం మాట్లాడు తున్నావో  నీకే తెలీదు. ఒక్కొక్క సారి నిన్ను నువ్వే బాధ పెట్టుకుంటున్నావు, ఇవన్నీ తెరలు తెరలుగా ,తరంగాల్లాగా వస్తూంటాయి. అందులో చిక్కుకు పోకుండా బయట పడాలి, అంటే నువ్వు ప్రయత్నించాలి. నువ్వు బయట పడడానికి మా సహకారం, సాయం ఉంటుంది

మృత్యువు మీద మనకు అదుపు లేదు. కాని మన జీవితం మీద మనకు ఉంది. ఇప్పుడు  నువ్వు గతం వేపు చూడకు. ఈ రోజున నీకు కావలసినది మానసిక దారుఢ్యం,పాజిటివ్ యాటిట్యూడ్ ,ఇప్పుడు నీకు అదే ఆక్సిజన్. జీవితానికి ఓ కాలిక్యులేషన్ ఉంది. అది అదృష్టానికి సంబంధించినది కాదు. ఆలోచనా ధోరణికి చెందిన క్వాలిటీ అది. జీవితంలో ఉన్నకష్టం అంతా మనకి ఏం కావాలో తెలుసుకోవడం లోనే ఉంది."

చాలు ఈ మాత్రం ప్రోత్సాహం చాలు. ఈమాత్రం ఆశ చాలు. నన్ను నేను రక్షించకోడానికి.  డిప్రెషన్ లో పూర్తిగా మునిగి పోకుండా చేయి అందిస్తున్నట్లుగా అనిపించింది.

డాక్టరు గారు వెళ్ళిపోయారు. మళ్ళీ గదిలో ఒంటరిగా.ఆక్సిజెన్ లేకుండా మౌంట్ ఎవరెస్ట్ ఎక్కాల్సి వచ్చినట్లుగా ఉంది.

కిటకీలకి గట్టిగా ,లావుగా ఉన్న గ్రిల్స్. నాలుగ్గదుల మధ్య ఉన్న నేను స్వేచ్ఛగా లేను అనిపించింది. బంధీ అయిపోయాను. ఇది మామూలు ఆసుపత్రి కాదు, మెంటల్ పేషెంట్ల హాస్పటల్. ఆ పిచ్చి వాళ్ళు కిటికీలోంచి కిందకి దూకకుండా. అలాంటి ప్రయత్నాలు ఏమీ చేయకుండా,కావచ్చు. ఆగదిలో ఏమీ లేదు. నేను పడుకున్న మంచం తప్ప.

ఈ ఖాళీ గది, నా ఖాళీ బుర్రకి సరిపోయింది. ప్రశాంతంగా ఉంది. ఇదే ఇల్లయితే , మందు వేసుకో, స్నానం చెయ్యి, తల దువ్వుకో, తయారవ్వు, కాలేజీకి వెళ్ళాలి, చదువుకో, అది చెయ్యి, ఇది వద్దు, లాంటి ఆంక్షలు ఏం లేవు.  వొత్తిడి లేదు.  ఏం చెయ్యక్కర్లేదు. నా సమయం. నా ఇష్టం. అసలు ఇలాంటి టైం వస్తుందని అనుకోలేదు. ఇది ఓ చిన్న గూడు.  బయటి వార్తలు,కఠినమైన నిజాలు చెవులకి చేరని గూడు, ఇది ప్రస్తుతం నేనుంటున్నది.  ఆశ్చర్యం, ఇది నాకు బావుంది. హాయిగా ఉంది. ఎంత భయంకరమైనవి జరగాలో అన్నీ జరిగిపోయాయి. ఎన్నో సార్లు నన్ను నేను బాధించుకున్నాను. ఛావాలనుకున్నాను. అవన్నీ ఈ క్షణాన పీడకలల్లా అనిపిస్తున్నాయి.

ఒక్క రోజులోనే ఇంత మార్పా! ఓ మనిషి తన మాటలతో డిప్రెషన్ లో ఉన్నవాళ్ళని మార్చగలడా. మార్చగలడు అని ఈ డాక్టరు మాటలతో తెలుస్తోంది.

డాక్టరు పాల్ గారు నన్ను బాగా అర్థం చేసుకున్నారు. నా మైండ్ ని చదవగలిగారు. చాలా అనుభవం ఉన్న డాక్టరు, అందుకే నన్ను ఎలా ప్రశాంతంగా ఉంచాలో కూడా అతనికి తెలుసు. ఓ విధంగా ఆశ , ఉత్సాహం , స్ఫూర్తి, ఇవన్నీ నాలో కలిగాయంటే దానికి కారణం ఈ డాక్టరు గారే. డాక్టర్లలోనే ఎంత తేడా అంతకు ముందు నేను వెళ్ళిన ఇద్దరు డాక్టర్లకి ఈ డాక్టరుగారికి సహస్రం తేడా. వాళ్ళకి తెలియనిది యితను కనిపెట్టారు.

ఇప్పుడు నాకు నా రెండో జీవితం ప్రారంభం అయినట్లుంది. ఈ మనిషి మూలంగానే. నన్ను మనిషిని చేసారు. నాతో మాట్లాడారు. అదే నాకు ఊపిరి. నామీద ఎంతో శ్రద్ధ పెట్టారు. మా వాళ్ళు కూడా చూపించనంత శ్రద్ధ డాక్టరుగారు చూపించారు. ఆత్మీయంగా మాట్లాడడం,దగ్గర కూచుని ప్రేమ కనపరచడం నేనున్నానన్న భావం కలిగించడం, చూపిస్తున్న ఈ శ్రద్ధ మనిషిని నిటారుగా నుంచో పెడుతుంది. దాని కున్నశక్తి అలాంటిది. అదే,మేమున్నాం అన్న భరోసా. ఆ భరోసాని ఇక్కడ ఇస్తున్నారు.

ఇది వరకూ ఇద్దరు డాక్టర్లు ప్రిస్క్ రైబ్ చేసిన మందులని డాక్టరు పాల్ గారు ఆపేసారు. ఇప్పుడు ఒక్క మందు మీదే ఉంటున్నాను. ఈ డ్రగ్ సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయి కానీ మా జాగ్రత్త తీసుకుని నీకు దీన్ని ఇస్తాము అని డాక్టరు అన్నారు. అదే లీథియం.ఆ టాబ్లెట్ ని రోజుకి రెండు సార్లు వేసుకుంటున్నాను. ఈ టాబ్లెట్ మా లాంటి వాళ్ళకి లైఫ్ సేవర్ అని అన్నారు.

" ఇది ఇప్పుడు వాడుతున్నాం, నువ్వు బాగానే ఉంటున్నావ్, అది వాడుతున్నంత సేపూ బాగానే ఉంటుంది. దీని వల్ల కొంచెం బరువు పెరుగుతుంది. చర్మం పైన దద్దుర్లు లాంటివి రావచ్చు, అందుకని చాలా జాగ్రత్తగా నీ డోసుని డివైడ్ చేసి ఇస్తాం. అది లేకుండా కూడా నువ్వు బాగా ఉన్నావనుకో, అప్పుడు ఈ మందుని పూర్తిగా మానేయచ్చు ఇంకా ఈ లీథియం గురించి తెలుసుకోవాన్న ఉత్సాహం ఉంటే నీకు దీని గురించిన వివరాలు అన్నీ ఇస్తాను " అని అన్నారు.

నేను చదువుకున్న దాన్ని. ఇంటర్ లో నా గ్రూపు బైపీసీ, కెమిస్ట్రీ ఉంది, బీఎస్సీలో కూడా అదే. అయినా నేను ఈ లీథియం గురించి తెలుసుకోడానికి ఏమాత్రం ఇంట్రెస్ట్ ఎందుకు చూపించడం లేదు. తెలీదు.

ఇదొక్కటే నాకు కావలసిన మందు. మరి అంతకు ముందు డాక్టర్లిద్దరూ కూడా సీవియర్ డిప్రెషన్కి మందులిచ్చారు. అవి డిప్రెషన్ కి మాత్రమే. అంతే కాని ఆ ఇద్దరూ కూడా నా లో ఏం జరుగుతోందో కూడా తెలుసుకోడానికి ఏ మాత్రం ప్రయత్నించలేదు. తెలుసుకుని ఉంటే ట్రీట్ మెంటు మార్చేవారా. కానీ వాళ్ళు నాతో సరిగా మాట్లాడ లేదు. నన్ను ఓ పేషెంటులాగే చూసారు. ఓ అంటరాని పేషెంటులా చూసారు.

కానీ ఈ డాక్టరు గారు నన్ను ఓ మనిషి లాగా చూసారు. ఒక పేషెంటుని అయినా మామూలుగా చూసారు. నాతో ఎంతో సేపు మాట్లాడారు. చాలా సపోర్టివ్ గా ఉన్నారు. ఇలాంటి కేసులు ఎన్నో చూసినట్లు, వాటిని ట్రీట్ చేసినట్లున్నారు. అందుకే ఎంతో నమ్మకంగా, కాన్ఫిడెంటుగా మాట్లాడుతున్నారు. నేను మామూలు మనిషిని అయిపోతానని గట్టిగా చెప్తున్నాడు. ఆ నమ్మకమే నాకు బలాన్ని, ధైర్యాన్ని ఇస్తోంది.

నేనిలా ఉండడం నా తప్పు కాదు అని డాక్టరుగారు చెప్పారు. ఇందులో నేను చేసిన నేరం ఏమీ లేదు. ఒక్కొక్కసారి ప్రవర్తనలో హెచ్చు తగ్గులు వస్తాయి. ఆ హెచ్చు తగ్గులు రాకుండా ఉండడం కోసం మందు మొదలు పెట్టామని డాక్టరుగారు అన్నారు. అది కూడా నాకెంతో ధైర్యాన్నిస్తోంది. అందరు డాక్టర్లూ ఇలా ఉంటే బావుంటుంది . కాని ఉండరు అని అంతకు ముందు నేను వెళ్ళిన ఇద్దరు డాక్టర్ల మూలంగా తెలుస్తోంది. ఏదైతేనేం నేను ఇప్పుడు సేఫ్ హాండ్స్ లో ఉన్నాను.

ఓ రెండు రోజులు గడిచాయి.

డాక్టరు గారు అందరినీ చూసాకా ఆఖరున నా దగ్గరికి వస్తారు. వచ్చాక తన వెంటఉన్న వాళ్ళని వెళ్ళి పొమ్మని సైగ చేస్తారు. వాళ్ళు వెళ్ళిపోగానే నాతో చాలా చక్కగా హాయిగా మాట్లాడుతారు.

ఆ గదిలో డాక్టరు గారితో మాట్లాడడం కన్నా నాకింకేం కావాలి. ఆయన మాటలు నాకు పెద్ద ఆశని జీవితం మీద ఉత్సాహాన్ని కలిగిస్తోంది. దాన్ని పట్టుకుని నడుస్తున్నాను.

" నిన్ను ఎలాగైనా మామూలు శృతిని చేయాలి, పాత శృతి గా చేయడానికి ప్రయత్నిస్తాను "

" చాలా థాంక్స్ డాక్టరుగారు,నా మీద అంత శ్రద్ధ తీసుకుంటున్నందుకు " అన్నాను ఎంతో నిజాయితీగా.

డాక్టరుగారు నిమిషం కళ్ళు మూసుకున్నారు. కుడిచేతిని ఛాతి ఎడమ వైపున ఉంచారు.

" మీకు దేవుడంటే బాగా నమ్మకం అనుకుంటాను "

" అవును. బాగా అని చెప్పలేను కానీ నమ్మకం ఉంది. దేవుడిమీద నమ్మకం లేకపోతే మనమీద కూడా మనకి నమ్మకం ఉండదు. నామీద నాకు నమ్మకం కుదరాలంటే ఆధ్యాత్మికత ఉండాలి. ఎందుకంటే రోజూ నన్ను నమ్మి వచ్చే వాళ్ళతో ఉంటాను. వాళ్ళ నమ్మకాన్నినా వైద్యానికి ఉపయోగించుకుంటాను. ఏ వైద్యానికైనా డాక్టరు మీద నమ్మ కం ఉండాలి అప్పుడే మందులు వైద్యం పనిచేస్తుంది "

అందుకనా అంత శ్రద్ధగా చూస్తున్నారు.!

"నీ మీద శ్రద్ధ తీసుకోవడానికి , ఓ కారణం ఉంది. నీకో సంగతి చెప్తాను, నేను స్కూల్లో చదువుకునే రోజుల్లో నా క్లాస్ మేట్ ఓ రోజున పురుగుల మందు తాగి, ఆత్మహత్య చేసుకుంది. ఆమెలో అలాంటి ఆలోచన ఉందన్న సంగతి కాని, ఉద్దేశం ఉందన్న సంగతి కాని, ఎనాడూ ఎవరికీ కొంచెం కూడా అనుమానం రాలేదు.

ఆమె పైకి బాగానే ఉండేది. కానీ లోపల ఏం ఉందో ఎవరికీ తెలీదు. కానీ ఏదో ఉంది. అది ఆమెని కష్టపెట్టి ఉండచ్చు. బతికి ఉండడం అనవసరం అనుకునే లాగా చేసి ఉండచ్చు. ఆమె ఎవరితో తన బాధని పంచుకోలేదు. చెప్పుకోలేదు. చెప్పి ఉంటే బాగుండేది. ఎంతో విలువైన జీవితాన్ని తృణప్రాయంగా వదిలేసింది. అందుకే తన జీవితాన్ని అంతం చేసుకుంది. ఆమె మరణం మా స్కూల్లో అందరినీ కుదిపేసింది. ఓ షాక్ లో పడేసింది.

మా అందరికీ ఎన్నో ప్రశ్నలు, జవాబులు దొరకని ప్రశ్నలు. జవాబులు లేవు. ఆమె ఎంతో బాగా చదువుకునేది. ఎప్పుడూ మంచి మార్కులు వచ్చేది. ఎప్పుడూ తిట్లు కూడా తినలేదు. ఎవరితోను అవమానింప బడలేదు. ప్రేమలో పడలేదు. అది కూడామాకు తెలుసు. ఆమె ఇంట్లో వాళ్ళు కూడా అలాంటిది ఏం లేదనిఅన్నారు. సాధారణంగా ప్రేమ వ్యవహారాల మూలంగానే,సూసైడ్ లు సంభవిస్తూంటాయి. ముఖ్యంగా ఆమె వయసు వాళ్ళల్లో, కానీ ఆమెఎందుకు చనిపోయిందో తెలీదు. ఏం జరిగి ఉంటుందో కూడా తెలుసుకోడానికి ప్రయత్నించాం. అందులో భాగంగానే ఆమె ఇంటికి వెళ్ళి అందరిని కలిసి అన్నీ కనుకున్నాం. అప్పుడు మాకు నిజం తెలిసింది. ఆమెకి సవితి తల్లి, ఆమె పెట్టే ఆరళ్ళు భరించలేక పోయింది.

ఆ భాధలు చెప్పుకునేందుకు సరి అయిన స్నేహితులు ఎవరూ లేరు అని. ఆమె ఒంటరిగానే ఉండేది అని. ఎవరితో మాట్లాడేది కాదని. అందుకని ఆమె సమస్య ఏంటో మాకు తెలీదు. కానీ ఏదో జరిగింది. ఆమె షేర్ చేసుకోలేదు. మామూలుగా ఆమె చాలా సెన్సిటివ్. ప్రతీ చిన్న విషయాన్ని ఎంతో సీరియస్ గా తీసుకునేది. అయితే ఆమె ఆత్మహత్య అప్పటి కప్పుడు తీసుకున్న నిర్ణయం కాదు. చాలా రోజుల్నించి ఆమె తీసుకున్న నిర్ణయం అది. ఇవన్నీ మానసిక సమస్యలు అని మాకు తెలీలేదు. ఇంట్లో, క్లాసులో ఒంటరిగానే ఉండేది. అందరూ ఎవరి పనుల్లో వాళ్ళుండే వాళ్ళు అందుకే ఆమెని పట్టించుకోలేదేమో. ఎందుకిలా చేసింది? కారణాలు ఏంటీ ? ఇంకా ఎన్నో ప్రశ్నలు

సరి అయిన సమాధానం రాలేదు, మేమంతా అయోమయంలో ఉండిపోయాం. ఈ అయోమయం మమ్మల్ని, శూన్యంలోకి విసిరేసింది. క్లాసులో అందరం ఇదే అనుకునే వాళ్ళం. అలా ఎలా సూసైడ్ చేసుకుంది ? ఏం బాధలున్నాయి ? ఏం కష్టం వచ్చింది?

***( కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments